సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 16 । మార్చి । 2023



రూ.16 కోట్ల ఆదాయంలో డీసీసీబీ

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూ.16.12 కోట్ల ఆదాయంలో పయనిస్తోందని ఆ బ్యాంక్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.59,110
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,280
3 శాతం జీఎస్టీతో	రూ.5,438
నవర (8 గ్రా)	రూ.43,504

గరిష్ఠం/కనిష్ఠం
32.5 /25.1

వాతావరణం

బుధవారం గాలిలో 69 శాతం తేమ ఉంది. వాతావరణంలో మార్పులతో జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. గురువారం అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'ప్రకృతి వ్యవసాయం'పై అవగాహన



మాట్లాడుతున్న శివజ్యోతి

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని బీవీ నగర్‌లో ఉన్న కేవీకేలో (కృషి విజ్ఞాన కేంద్రం) బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ లలితా శివజ్యోతి మాట్లాడుతూ అన్నదాతలు పురుగుమందులు, రసాయన ఎరువులతో చాలాచోట్ల వ్యవసాయం చేస్తున్నారన్నారు. గో ఆదారిత వ్యవసాయంపై మొగ్గు చూపితే ఖర్చు తగ్గడంతోపాటు లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీపీఏ మాలకొండయ్య, ఏడీపీఎం సీహెచ్ రవి చంద్రప్రసాద్, ఐడీడీఏ ఏపీఓ కె.అనురాధ, శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సాధించాలి

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



సిబ్బందితో మాట్లాడుతున్న పెంచలయ్య

ఉదయగిరి: వైద్యారోగ్య సిబ్బంది తమకు కేటాయించిన లక్ష్యాలను నూరుశాతం సాధించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశించారు. బుధవారం పట్టణంలోని బిట్–2 గ్రామ సచివాలయ పరిధిలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రికార్డులు చూసి సిబ్బందికి సూచనలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 5.30 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించామన్నారు. కార్యక్రమంలో ఫ్లోరోసిస్ జిల్లా కన్సల్టెంట్ దివ్య, సూపర్‌వైజర్ అక్బర్‌బాషా, సిబ్బంది శ్రీనివాసులు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

2,215 పొగాకు బేళ్ల విక్రయం




పొగాకు బేళ్లు (ఫైల్)

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 589 బేళ్లు వేలానికి రాగా వాటిలో 587 బేళ్లను విక్రయించినట్లు పొగాకు బోర్డు సిబ్బంది తెలిపారు. మిగిలిన 2 బేళ్లలో ఒకటి నోబిడ్, ఒకటి సీఆర్‌గా గుర్తించారు. 79,016 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.1,57,26,986 వ్యాపారం జరిగింది. కిలో పొగాకుకు గరిష్ఠంగా రూ.200, కనిష్ఠంగా రూ.193, మొత్తంగా సగటు ధర రూ.199.04 లభించింది. వేలంలో 6 కంపెనీలు పాల్గొన్నాయి.

• **కలిగిరి:** కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 1,628 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్ కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 1,737 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 1628ని కొనుగోలు చేశారని, 109 బేళ్లను తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకుకు గరిష్ఠంగా రూ.200, కనిష్ఠంగా రూ.195, సగటున రూ.198.07 ధర లభించింది. వేలంలో 6 కంపెనీలు పాల్గొన్నాయి.

సోమశిలలో 56.983 టీఎంసీలు



సోమశిల జలాశయం (ఫైల్)

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 56.983 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 1,500 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 533, దక్షిణకాలువకు 350, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.579 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 316 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

హైవే పనులు రయ్.. రయ్

వింజమూరు - దుత్తలూరు మార్గంలో 70 శాతం మేర పూర్తి



- త్వరలో నెరవేరనున్న మెట్టప్రాంత వాసుల కల
- శరవేగంగా జరుగుతున్న జాతీయ రహదారి పనులు
- మూడు జిల్లాల ప్రజలకు ఉపయోగం

కావలి – సీతారామపురం జాతీయ రహదారి. ఇది కావలి, ఉదయగిరి నియోజకవర్గాలను కలుపుతూ రాయలసీమ జిల్లాలను అనుసంధానం చేస్తుంది. ఈ రోడ్డు నిర్మాణం దశాబ్దాలుగా మెట్ట ప్రాంతవాసుల కల. గత పాలకులు దీనిని పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో నేడు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్తయితే మూడు జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు పూర్తిగా మారనున్నాయి.

ఉదయగిరి: కావలి – సీతారామపురం జాతీయ రహదారి పనులు వేగంగా సాగుతున్నాయి. మొదటిదశలో కావలి నుంచి దుత్తలూరు వరకు 64.9 కి.మీ రోడ్డును అభివృద్ధి చేసే పనులు చకచకా చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే వింజమూరు – దుత్తలూరు మార్గంలో 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. కావలి నుంచి దుత్తలూరు వరకు కల్వర్టులు, వంతెనలు కొన్ని పూర్తికాగా మరికొన్నిటిని త్వరితగతిన నిర్మించేందుకు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. 2024 సంవత్సరం జూన్ కల్లా మొదటిదశ పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తూ పురోగతిపై పూర్తిస్థాయి దృష్టిపెట్టారు.

మెట్టలో పెరగనున్న సౌకర్యాలు

104.4 కి.మీ పొడవున్న కావలి – సీతారామపురం రోడ్డు మార్గంలో నిత్యం ఐదు వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని అంచనా. జాతీయ రహదారి పనులు పూర్తయితే కావలి పట్టణంతోపాటు ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో ఈ మార్గంలో ఉన్న గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ఈ రోడ్డును 14 మీటర్ల వెడల్పుతో విస్తరిస్తున్నారు. పది మీటర్ల తారురోడ్డుతోపాటు రెండు వైపులా నాలుగు మీటర్లు అదనంగా రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు.

మూడు జిల్లాలకు ఉపయోగపడేలా..

రామాయపట్నం పోర్టు పనులు పూర్తయిన తర్వాత వాహనాల రాకపోకలు పెరిగే అవకాశముంది. దీనిని దృష్టిలో పెట్టుకుని నెల్లూరు, వైఎస్సార్ కడప, ప్రకాశం జిల్లాల మధ్య అంతర్గత మార్గాలను కలిపే విధంగా తొలిదశలో కావలి – దుత్తలూరు రోడ్డును విస్తరిస్తున్నారు. దీని వల్ల పోర్టు నుంచి వచ్చే సరుకులను కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలోని నకిరేకల్, చిత్తూరు జిల్లా, కడప జిల్లాలోని బద్వేల్, ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సులువుగా తక్కువ వ్యయంతో రవాణా చేయొచ్చు.



వింజమూరు - దుత్తలూరు మార్గంలో కొంతమేర పూర్తయిన రోడ్డు పనులు



వింజమూరు చెరువుకట్ట వద్ద రోడ్డును విస్తరిస్తున్న దృశ్యం

ఫలించిన మేకపాటి కృషి

ఈ రహదారిని విస్తరించాలని గతంలోనే ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కానీ ఆయన అకాల మరణంతో ఈ ప్రతిపాదన ఆగిపోయింది. ఆ తర్వాత అధికారంలోకొచ్చిన టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి రోడ్డు విస్తరణ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఈ మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా అనుమతులు లభించాయి. అంతేకాకుండా ఈ మార్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. దీంతో మెట్టప్రాంత వాసుల కల త్వరలో ఫలించబోతోంది.

మెట్ట ప్రాంత అభివృద్ధిపై సీఎం దృష్టి



ఉదయగిరి, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం. ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు నిధులు మంజూరు చేయించారు. త్వరలో రామాయపట్నం పోర్టు అందుబాటులోకి రానుంది. దీంతో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఈక్రమంలో జాతీయ రహదారి నిర్మాణంతో ఎన్నో ప్రయోజనాలుంటాయి.

– మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఉదయగిరి

వేగంగా పనులు

కావలి – దుత్తలూరు హైవే రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్‌కల్లా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే కొంతమేర తారురోడ్డు పనులు కూడా పూర్తయ్యాయి. కల్వర్టులు, వంతెనల పనులు కూడా త్వరితగతిన జరుగుతున్నాయి. సకాలంలో పూర్తిచేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం.

– అనిల్, డీఈ, నేషనల్ హైవే

ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది



ఉదయగిరి ప్రాంతవాసులు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న జాతీయ రహదారి కల త్వరలో నెరవేరబోతోంది. పనులు పూర్తయితే ఉదయగిరి ప్రాంతంలోని అనేక గ్రామాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి. ఈ ప్రభుత్వ హయాంలోనే ఉదయగిరి అభివృద్ధికి అవసరమైన రోడ్డు మార్గం రావడం సంతోషకరం.

– చుండి చైతన్య, దుత్తలూరు

నేడే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

- చిత్తూరులో ఏర్పాట్లు చేసిన అధికారులు
- కౌంటింగ్ ప్రక్రియకు 916 మంది సిబ్బంది
- గెలుపుపై వైఎస్సార్‌సీపీ ధీమా

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తూర్పు రాయలసీమ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. చిత్తూరు జిల్లా కేంద్రానికి సమీపంలోని ఆర్‌వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈనెల 13న జిల్లాలో 169 కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే కౌంటింగ్ ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి 40 టేబుల్స్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 14 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లుగా 193 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లుగా 551 మంది, మైక్రో అబ్జర్వర్లుగా 172 మందిని నియమించారు.

వారిలో ఉత్సాహం

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై వైఎస్సార్‌సీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఎన్నికల రోజు జరిగిన వివిధ సర్వేలు, ఎగ్జిట్ పోల్స్‌లో ఆ పార్టీ మద్దతుదారులు విజయం సాధిస్తారని చెప్పడంతో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. నాలుగు సంవత్సరాలుగా జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అదే జరుగుతుందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. గడిచిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులు ఇతర పార్టీల మద్దతుతో విజయం సాధిస్తూ వచ్చారు. టీడీపీ కూడా అభ్యర్థులను పెట్టింది. అయితే ఓటమి తప్పదని ముందే భావించింది. దీంతో చివరి అంకంలో రెండో ప్రాధాన్యత ఓటు కోసం ఆ పార్టీ, పీడీఎఫ్‌లు ఒకరికొకరు సహకరించుకున్నాయి.



కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుల్స్

మూడు షిఫ్టుల్లో..

సాక్షి, చిత్తూరు/చిత్తూరు కలెక్టరేట్: ఓట్ల లెక్కింపుపై బుధవారం చిత్తూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్, డీఆర్వో రాజశేఖర్ అధికారులకు, సిబ్బందికి సూచనలిచ్చారు. కౌంటింగ్ సుదీర్ఘంగా సాగే అవకాశం ఉన్నందున మూడు షిఫ్టుల్లో సిబ్బంది పనిచేసేలా ఏర్పాట్లు చేశారు. అదనపు సిబ్బందిని సైతం నియమించారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేక శిక్షణను పూర్తి చేశారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ పేపర్లు తెరిచి, పోలైన ఓట్లను బండిల్స్ కడతారు. గురువారం సాయంత్రానికి మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారు. అందులో ఎవరూ గెలవకపోతే, ఎలిమినేషన్ పద్ధతిలో లెక్కింపు చేస్తారు. సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

తొలిరోజు పరీక్షకు 839 మంది గైర్హాజరు



కొడవలూరులో పరిశీలిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

- ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ ప్రారంభం
- కొడవలూరులో పరిశీలించిన కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు జిల్లాలోని 95 కేంద్రాల్లో బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఒకేషనల్ జీఎఫ్‌సీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జనరల్ విభాగంలో 27,151 మందికి గానూ 26,464 మంది హాజరయ్యారు. 687 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,714 మందికి గానూ 1,562 మంది హాజరయ్యారు. 152 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు కావడంతో తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని ఉదయం 7 నుంచి 8 గంటల మధ్యే పరీక్ష కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో గుమిగూడారు. గేట్లు తీసే వరకు చెట్ల కింద, రోడ్లపై ఎదురుచూశారు. కొందరు ఆఖరి నిమిషాల్లో సెంటర్లకు చేరుకున్నారు.

• కలెక్టర్ చక్రధర్‌బాబు కొడవలూరు మండలం చంద్రశేఖరపురం ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలకు వెళ్లారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. వసతులున్నాయా? లేదా? ఆరాతీశారు. ఆయన వెంట తహసీల్దార్ రమాదేవి, ప్రిన్సిపల్ విష్ణుప్రియ ఉన్నారు.

• ఇంటర్మీడియట్ బోర్డు అధికారి శేషుకుమారి, కావలి, బిట్రగుంట, పరీక్షల కన్వీనర్, ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు, జిల్లా పరిశీలకుడు మధుబాబు, పరీక్షల కమిటీ సభ్యులు 75 కేంద్రాలను తనిఖీ చేశారు. బిట్రగుంట పరీక్ష కేంద్రంలో ఓ విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ స్క్వాడ్‌కు దొరికిపోయాడు.



నెల్లూరులో పరీక్ష కేంద్రానికి చివరి నిమిషంలో వచ్చిన విద్యార్థిని



సంగం: పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

నేడు ద్వితీయ సంవత్సరం పరీక్షలు

గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగనున్నాయి. 28,304 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది.

పరిశీలించిన ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలోని సర్వోదయ, విశ్వసాయి జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షల నిర్వహణ తీరును బుధవారం ఎస్పీ సీహెచ్ విజయారావు పరిశీలించారు. భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు తదితర విషయాల గురించి ఆరా తీశారు. ఆయన వెంట నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ, చిన్నబజారు ఇన్‌స్పెక్టర్లు ఎం.మధుబాబు, షఫీ, ఎ.సురేంద్రబాబు తదితరులున్నారు.

ఉగాది రోజున మెగా గృహ ప్రవేశాలు

• గృహ నిర్మాణ శాఖ జిల్లా పీడీ వెంకటదాస్

తోటపల్లిగూడూరు: తెలుగు సంవత్సరాది ఉగాది రోజున 16 వేల గృహ ప్రవేశాలు నిర్వహిస్తామని హౌసింగ్ పీడీ వెంకటదాస్ తెలిపారు. మండలంలోని ఇస్కపాళెం, కోవెరపాళెం, వెంకన్నపాళెం, కొత్తపాళెం గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను బుధవారం పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటిదశలో మంజూరైన 69,087 పక్కాగృహాలకు గానూ 61,228 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి ఇప్పటికే రూ.330 కోట్లు ఖర్చు చేశామన్నారు. రెండో విడతలో మరో 20,136 పక్కాగృహాల మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదో వివరాలను సేకరించామన్నారు. సంబంధిత లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులను జారీ చేశామన్నారు. ఉగాది రోజున మెగా గృహ ప్రవేశాలను వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని మండల స్థాయి అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ నాగరాజు, డీఈ వరప్రసాద్, స్థానిక ఏఈ ముక్తార్‌బాషా, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, ఎంపీడీఓ హేమలత, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, సిబ్బంది సుమన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఇస్కపాళెంలో ఇళ్ల నిర్మాణాల గురించి ఆరా తీస్తున్న హౌసింగ్ పీడీ

అభివృద్ధి పథంలో స్వయం సహాయక సంఘాలు

- మహిళా మార్టుల ఏర్పాటుకు ముందుకురావాలి
- త్వరలో సంఘాల ద్వారా గ్యాస్ సిలిండర్ల సరఫరా
- సెర్ప్ సీఈఓ ఎండీ ఇంతియాజ్

కొడవలూరు: రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని సెర్ప్ సీఈఓ ఎండీ ఇంతియాజ్ తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో డీఆర్‌డీఏ ద్వారా బుధవారం ఏర్పాటు చేసిన పొట్టేళ్ల యూనిట్ల పంపిణీ తదితర కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సంఘాలు ఎంతో చురుగ్గా పనిచేస్తున్నాయంటే అందులో కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీల కృషి ఎంతో ఉందన్నారు. రుణాల చెల్లింపులు 99 శాతం ఉండడంతో తిరిగి రుణాలిచ్చేందుకు బ్యాంక్‌లు ముందుకొస్తున్నాయని చెప్పారు. వినూత్న కార్యక్రమాలు చేపట్టడం ద్వారా లాభదాయకంగా ఉండడంతోపాటు పలువురికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటున్నందున వాటిపై దృష్టి సారించాలన్నారు. మహిళా మార్టులు లాభదాయకంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 25 మార్టులు ఏర్పాటు చేస్తే ఒక్కో మార్టు రోజుకు రూ.లక్ష వ్యాపారం చేస్తోందని చెప్పారు. జిల్లాలో కూడా వీటి ఏర్పాటుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. గ్యాస్ సిలిండర్లను గ్రామీణ ప్రాంతాలకు మహిళా సంఘాల ద్వారా సరఫరా చేసేందుకు హెచ్‌పీ కంపెనీతో ఒప్పందం చేసుకున్నామన్నారు. కొడవలూరులో సంఘాలు ముందుకురావడంతో వారి ద్వారా త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు.



పొట్టేళ్ల యూనిట్ లబ్ధిదారుతో మాట్లాడుతున్న సీఈఓ, కలెక్టర్

చాటిచెప్పింది నెల్లూరు మహిళలే..

కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ దేశానికే మహిళా శక్తిని చాటి చెప్పింది నెల్లూరేనన్నారు. పొదుపు ఉద్యమానికి తామంతా పూర్తి సహకారమందిస్తామన్నారు. మహిళలు వ్యక్తిగత ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా పొదుపు మహిళలు కృషి చేయాలన్నారు. తొలుత వివిధ స్టాల్స్‌ను సీఈఓ, కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సారమ్మ, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఏపీఎం ఎస్.రుక్మిణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలువలో పడి వృద్ధుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సోమశిల : మండలంలోని మంగుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రాజాల రోశయ్య (70) ఉత్తరకాలువలో పడి మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ సమీపంలో కాలువ వద్ద రోశయ్య బహిర్భూమికి వెళ్లి కాలు జారి ప్రవాహంలో గల్లంతయ్యాడు. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఎంతకీ రాకపోవడంతో కుటుంబసభ్యులు కాలువ సమీపంలో పరిశీలించారు. ఫలితం కనిపించలేదు. కాగా రోశయ్య మృతదేహం మండల పరిధిలోని ముత్తుకూరు గ్రామం వద్ద కాలువ ప్రవాహంలో కొట్టుకు రాగా స్థానికులు గుర్తించి అనంతసాగరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి రోశయ్యగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

నిమ్మధరలు (కిలో)	పౌల్ట్రీ ధరలు
పెద్దవి : రూ.90	బ్రాయిలర్ (లైవ్) : 109
సన్నవి : రూ.80	లేయర్ (లైవ్) : 75
పండ్లు : రూ.40	బ్రాయిలర్ చికెన్ : 194
	బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 216
	లేయర్ చికెన్ : 128

రూ.16 కోట్ల ఆదాయంలో డీసీసీబీ

- జిల్లాలో 70 గోదాముల నిర్మాణం
- చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూ.16.12 కోట్ల ఆదాయంలో పయనిస్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీబీ కార్యాలయంలో బుధవారం మహాజన సభ జరిగింది. ఇందులో చైర్మన్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచి బ్యాంకు నిలదొక్కుకునేందుకు రూ.70 కోట్ల సాయం చేశారన్నారు. ఇప్పటికే రుణాలు 91 శాతం రికవరీ అయ్యాయని, దీనిని 95 శాతానికి పెంచాలని ఆదేశించారు. జిల్లాలో పలు సొసైటీల ద్వారా 70 గోదాముల నిర్మాణానికి అనుమతి వచ్చిందని, కొన్ని తుదిదశకు చేరుకున్నాయన్నారు. నాబార్డు, ఆప్కాబ్ సహాయంతో సహకార రైతు వికాస్ పథకం ద్వారా 2022–23 సంవత్సరానికి 2,556 మంది రైతులకు రూ.117.87 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. బంగారు ఆభరణాల హామీపై రూ.174.24 కోట్లు, జగనన్న తోడు పథకం ద్వారా 1,353 మందికి రూ.1.35 కోట్లు, ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా 8,607 మందికి రూ.8.60 కోట్ల రుణాలిచ్చామన్నారు. ఈ నెలాఖరులోగా మరో రెండు మొబైల్ ఏటీఎంలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఎరువుల వ్యాపారం చేసుకునేందుకు 11 సంఘాలకు రూ.2 కోట్ల బ్యాంకు గ్యారెంటీ ఇచ్చామన్నారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టరు వెంకటరమణయ్య, ఖంతర్‌అలీ, రమణయ్య, బ్యాంకు సీఈఓ శంకర్‌బాబు, డీసీఓ తిరుపాల్‌రెడ్డి, నాబార్డ్ డీడీఎం రవిసింగ్, ఆప్కాబ్ జీఎం కృష్ణారావు, బ్యాంకు జీఎం సరిత, డీజీఎంలు దయాకర్‌రెడ్డి, ఉషారాణి, నాగేంద్రకుమారి, సహకార సంఘాల అధ్యక్షులు, సీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార అభివృద్ధి కోసం రుణాలు

డీసీసీబీలో చైర్మన్ సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన బుధవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో పాలకవర్గ సభ్యులు పలు కీలక తీర్మానాలు చేశారు. మారెంరెడ్డిపల్లి, సంగం ప్రాంతాల్లో సొసైటీల ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోలు బంకుల నిర్వహణ, వ్యాపారాన్ని పెంచుకునేందుకు ఒక్కో సొసైటీకి రూ.50 లక్షల వంతున ఇవ్వాలని తీర్మానించారు. సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై ఏ ఇతర వాణిజ్య బ్యాంకులు ఇవ్వని విధంగా 0.50 అత్యధిక వడ్డీ ఇచ్చేందుకు, స్వల్పకాలిక గరిష్ట రుణ పరిమితిని రూ.20 లక్షలు, స్థిరాస్తి తాకట్టుపై గరిష్ట రుణ పరిమితి రూ.25 లక్షలు, వ్యక్తిగత రుణాలను రూ.5 లక్షలు, చిరువ్యాపారులకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలను రూ.2 లక్షలు, గృహ నిర్మాణాల కోసం గరిష్టంగా రుణాన్ని రూ.75 లక్షలు, ఎడ్యుకేషన్ లోన్స్(విద్యా రుణాలు) రూ.20 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించారు.

సెర్ప్ సీఈఓను కలిసిన అధికారులు


ఇంతియాజ్‌తో మాట్లాడుతున్న కమిషనర్, డీఆర్‌డీఏ పీడీ

నెల్లూరు(పొగతోట) : అడిషనల్ సీసీఎల్‌ఏ, మైనార్టీ కమిషనర్, సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం జిల్లాకు వచ్చారు. నగరంలోని హోటల్‌లో ఉన్న ఆయన్ను కార్పొరేషన్ కమిషనర్ హరిత, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు కలిశారు.

రూ.కోటి విలువైన మందుల సరఫరా

- జేడీ మహేశ్వరుడు


మందులను పరిశీలిస్తున్న జేడీ

నెల్లూరు(సెంట్రల్) : జిల్లాలో మూగజీవాలకు పంపిణీ చేయాల్సిన రూ.కోటి విలువైన వివిధ రకాల మందులను పలు నియోజకవర్గాలకు సరఫరా చేసినట్లు పశు సంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు పేర్కొన్నారు. నెల్లూరులోని ఆయన కార్యాలయంలో గోడౌన్ నుంచి మందులను కందుకూరు, నెల్లూరు, కావలి నియోజకవర్గాలకు బుధవారం సరఫరా చేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ జిల్లాలోని 175 పశుసంవర్ధక వైద్యశాలలకు సంబంధించి మందులను సరఫరా చేస్తున్నామన్నారు. మూగజీవాల వైద్యం కోసం అవసరమైన అన్నిరకాల మందులను ఉచితంగా ఇస్తామన్నారు.

ఏపీ జెన్‌కోలో నూతన హాపర్స్ ఏర్పాటు


పగిలిపోయిన స్థానంలో ఏర్పాటు చేసిన నూతన హాపర్స్

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో గత సంవత్సరం మే 27వ తేదీన రెండో యూనిట్‌కు సంబంధించి పగిలిపోయిన (ఈఎస్‌పీ) యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ హాపర్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. వ్యాక్యూమ్ పంప్స్ పనిచేయకపోవడం వల్ల బూడిదతో ఒత్తిడి పెరిగి 4 హాపర్స్ పగిలిపోయి, వందల టన్నుల బూడిద నేలపాలైన విషయం తెలిసిందే. ఒక యూనిట్‌కు సంబంధించి 128 హాపర్స్ ఉంటాయి. ఒక హాపర్ సుమారు 80 టన్నుల ఫ్లైయాష్ నిల్వ సామర్థ్యం కలిగి ఉంటుంది. బూడిదతో నిండిపోయిన ప్పుడల్లా వీటిని శుభ్రం చేయాలి. లేకుంటే ఈ ఇనుప రేకుల హాపర్స్ పగిలిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. ఆరు మాసాల తర్వాత వచ్చిన కొత్త హాపర్స్‌ను బీహెచ్‌ఈఎల్ సంస్థ వాటి స్థానంలో అమర్చే కార్యక్రమం ప్రారంభించగా, ఇటీవల ఈ ప్రక్రియ పూర్తైంది. ప్రస్తుతం వీటికి పైపులు అమర్చే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

కన్నపేగు తరిమేసింది

- వృద్ధ దంపతుల ఆవేదన
- సీఐ వద్ద కన్నీరుమున్నీరు


పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న వృద్ధ దంపతులు

ఆత్మకూరు : ఎదిగిన కొడుకు వృద్ధాప్య దశలో ఆదుకుంటాడనుకుంటే తన్ని తరిమేశాడని, తమకు న్యాయం చేయాలని ఓ వృద్ధ దంపతులు ఆత్మకూరు సీఐ ఎం.నాగేశ్వరరావును వేడుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వివరాల్లోకెళ్తే అనంతసాగరానికి చెందిన షేక్ జిలానీ, మస్తాన్‌బీ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బేల్దారి పనులు చేసుకుంటూ పిల్లలను పోషించారు. ముగ్గురు పిల్లలకు వివాహాలు జరిగాయి. రెండో కుమారుడు ఖాజారంతుల్లా బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లాడు. ఈ నేపథ్యంలో వృద్ధులైన జిలానీ, మస్తాన్‌బీలకు రెండో కుమారుడు ప్రతి నెలా రూ.5 వేలు ప ంపుతున్నాడు. గత పదేళ్లుగా గ్రామంలోనే మరో ఇంట్లో ఉంటున్న పెద్ద కుమారుడు షబ్బీర్ ఏడాది క్రితం తల్లిదండ్రుల వద్దకు చేరాడు. ఇల్లు తనకు ఇవ్వాలంటూ వారిని వేధించడ ం మొదలుపెట్టాడు. ఆరు నెలల క్రితం గొడవపడి తండ్రిని కొట్టడంతో మెడ వద్ద నరం దెబ్బతిని ఆస్పత్రిలో నెల రోజులకుపైగా చికిత్స పొందాడు. అయినప్పటికీ చేయి, కాలు ప నిచేయని పరిస్థితి నెలకొంది. ఈ స్థితిలోనూ షబ్బీర్ తల్లిదండ్రులతో గొడవ పడుతూ ఇంటి నుంచి వెళ్లిపోవాలని మంగ ళవారం తన్ని తరిమేశాడు. దీంతో వృద్ధులు బుధవారం ఆత్మకూరు సీఐని ఆశ్రయించారు. దీనిపై స్పందించిన సీఐ నాగేశ్వరరావు పూర్తి వివరాలు తెలుసుకుని సీనియర్ సిటిజన్ యాక్ట్ 27 ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్డీఓ కోర్టుకు వీరిని పంపే ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. తల్లిదండ్రులను పిల్లలు బాధ్యతగా చూసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్) : నా అనే వారు లేకపోవడం, వెంటాడుతోన్న అనారోగ్య సమస్యలతో ఓ వృద్ధురాలు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన విజయమహల్‌గేటు వద్ద చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై బుధవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్ స్టీల్‌ఫ్యాక్టరీ వీధిలో పి.విజయభార్గవి(66) ఒంటరిగా నివాసం ఉంటున్నారు. చాలా కాలం క్రితం భర్త నుంచి విడిపోయారు. పిల్లలు కూడా లేకపోవడంతో ట్యూషన్‌లు చెప్పుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. మరోవైపు ఒంటరితనం ఆమెను కృంగదీసింది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం ఉదయం విజయమహల్‌గేటు వద్ద జీటీ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. గేటు కీమెన్ రాజేశ్వరి ఆత్మహత్య ఘటనపై రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ టి.ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వద్ద కాగితం లభ్యమైంది. అందులో తన పేరు విజయభార్గవి, ఆంధ్ర బ్యాంకు ఎదురు, బాలాజీనగర్ అని రాసి ఉంది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పేపర్ ఆధారంగా హెడ్‌కానిస్టేబుల్ మృతురాలి ఆచూకీ కోసం గాలించారు. ఆమె ఇంటిని గుర్తించి వెళ్లి చూడగా సూసైడ్‌నోట్ ఉంది. తన చావుకు ఎవరూ కారణం కాదని, ఒంటరితనం, అనారోగ్యంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు, తనకు రావల్సిన డబ్బులు బంధువులకు ఇవ్వాలని రాసి ఉంది. దానిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్) : గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన రాజరాజేశ్వరి ఆలయం వద్ద బుధవారం వెలుగు చూసింది. మృతుడికి 45 నుంచి 50 ఏళ్ల వయసు ఉండొచ్చని భావిస్తున్నారు. అతని ఎడమచేతికి సెలైన్ క్యాన్‌లా పెట్టి ఉంది. ఆలయం దగ్గర మృతదేహాన్ని గమనించిన స్థానికులు దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకటాద్రినాయుడు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని చేతికి క్యాన్‌లా ఉండటంతో ఆస్పత్రిలో వివరాల కోసం ఆరాతీశారు. అయినా ఆచూకీ తెలియరాలేదు. మృతుని గురించి తెలిసిన వారు దర్గామిట్ట పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

నగర పంచాయతీ కార్యాలయము, బుచ్చిరెడ్డిపాళెం

బహిరంగ వేలము ప్రకటన

ఆర్.ఓ.సి.నెం: 18/A1/2023 — తేది: 13-03-2023

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి చెందిన ఈ క్రింది షెడ్యూలులో కనబరచిన తాత్కాలిక తిరునాళ్ల అంగళ్లు మరియు ఇతరములను తేది: 18-03-2023 శనివారం ఉదయం గం.11.00లకు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయము నందు బహిరంగ వేలములు జరుపబడును. సదరు వేలములలో పాల్గొనదలచిన వారు ఆయా వివరములకు ఎదురుగా పొందుపరచిన ధరావత్తు రుసుము చెల్లించి వేలము నందు పాల్గొనవచ్చును. మరియు సదరు వేలములలో పాల్గొనదలచిన వారు ఈ క్రింది కనబరచిన వివరముల ప్రకారము ఆస్తి విలువ ధృవీకరణ పత్రములు, ఇండ్లపై నగర పంచాయతీ కమీషనరు వారి వద్ద నుండి, భూములపై తహశీల్దారు వారి కార్యాలయము నుండి పొందవలయును మరియు సదరు ఆస్తిపై గత 13 సంవత్సరముల నుండి ఎలాంటి తాకట్టు లేవని సంబంధిత సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయము నందు ఇ.సి. ధ్రువీకరణ పత్రము పొందవలయును. ఆస్తి లేని వారు సదరు మొత్తము నగదుగా చెల్లించి వేలము పాటలలో పాల్గొనవచ్చును. వేలములు పాక్షికముగా గానీ, వాయిదా వేయుటకు లేక రద్దుపరచుట నగర పంచాయతీకి అధికారము కలదు. ఇతర వివరములు కార్యాలయపు పని వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

క్ర.సం.	వివరములు	ఆస్తి విలువ	ధరావత్తు
1.	బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో శ్రీరామనవమి సందర్భంగా నగర పంచాయతీలోని శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవ సమయములో తేది. 30.03.2023 నుండి 09.04.2023 వరకు పబ్లిక్ రోడ్డు మార్జిన్లలో తాత్కాలిక తిరునాళ్ల అంగళ్లు వేసుకొను వారి నుండి రుసుము వసూలు హక్కు వేలము జరుపుటకు	రూ.50,000/-	రూ.25,000/-
2.	బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ ఏరియాలో మత్స్య, మాంస, కూరగాయలు, తోపుడు బండ్లు మరియు నిర్దిష్ట ప్రదేశములో వ్యాపారం చేయువారి నుండి రుసుము వసూలు చేసుకొను హక్కు తేది: 01.04.2023 నుండి 31.03.2024 వరకు లీజుకు ఇచ్చుటకు వేలము జరుపుటకు	రూ.50,000/-	రూ.25,000/-

గమనిక : అనివార్య కారణముల వలన వేలములు జరుగు తేదీని ప్రభుత్వం వారు శెలవు దినముగా ప్రకటించిన యెడల మరుసటి కార్యాలయము పని చేయు రోజున వేలములు నిర్వహించబడును.

సం/- యల్.చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనరు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ